

కిలో టమాటా రూ.16
అనంతపురం కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాటా గరిష్టంగా రూ.16 ప్రకారం ధర పలికాయి. మార్కెట్‌కు 645 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



చీనీ @ రూ.30 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.30 వేలు, కనిష్టం రూ.13 వేల ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.3°/14.1°

జిల్లాలో గురువారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేకువజామున కొన్ని ప్రాంతాల్లో చలి వాతావరణం కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఈ-క్రాప్‌లో నమోదైతేనే పరిహారం
- డీఏఓ సుబ్బారావు



సిబ్బందితో మాట్లాడుతున్న డీఏఓ సుబ్బారావు


తాడిమర్రి: రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకుంటేనే నష్ట పరిహారం వర్తిస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి(డీఏఓ) వైవీ సుబ్బారావు పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎం.అగ్రహారం, మర్రిమాకులపల్లిలో రైతులు సాగు చేసిన వేరుశనగ, వరి పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రం అధికారులు ఈ క్రాప్ నమోదు చేస్తారన్నారు. వివరాలను పారదర్శకంగా నమోదు చేయాలని ఆర్‌బీకే సిబ్బందిని ఆదేశించారు. ఫిబ్రవరి 20లోగా ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ కృష్ణయ్య, ఏఓ రమాదేవి, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

13న జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన
కొత్తచెరువు: పుట్టపర్తి మండలంలోని మంగళకర పాఠశాలలో ఈ నెల 13న జిల్లా స్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి ఓ ప్రకటనలో తెలిపారు. ఆరోగ్యం, పరిశుభ్రత, సాఫ్ట్‌వేర్ యాప్స్, వాతావరణ మార్పులు- పర్యావరణ హిత పదార్థాలు, గణితశాస్త్ర మోడల్స్ తదితర 5 అంశాలపై ప్రదర్శన ఉంటుదన్నారు. ప్రతి మండలం నుంచి జిల్లా స్థాయికి ఎంపిక చేసిన వారు మాత్రమే ఇందులో పాల్గొంటారన్నారు. ఒక విద్యార్థి, ఒక టీచర్ మాత్రమే పాల్గొనాలన్నారు. ఒక్కో అంశం నుంచి రెండు చొప్పున మొత్తం 10 ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

11, 12 తేదీల్లో అకౌంట్ టెస్ట్
కొత్తచెరువు: జిల్లాలోని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు ఈ నెల 11, 12న అకౌంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు డీఈఓ మీనాక్షి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పరీక్ష ఉంటుందన్నారు. హాల్ టికెట్లను ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రం వివరాలు అందులోనే ఉంటాయని, గంట ముందే కేంద్రానికి హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు.

వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు వేగవంతం చేయాలి
పుట్టపర్తి అర్బన్: జిల్లాలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు వేగవంతం చేయాలని జేసీ చేతన్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) అనంతరం కలెక్టరేట్‌లో అధికారులతో జేసీ సమావేశమయ్యారు. క్యాన్సర్ కేసులు, ఆరోగ్యశ్రీలో నమోదవుతున్న కేసులు, ఐసీడీఎస్ పని తీరు, నాడు-నేడు ప్రగతిపై సమీక్షించారు. హైరిస్క్ గర్భిణులను తరలించే క్రమంలో చేపట్టాల్సిన సత్వర చర్యలను వివరించారు. ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని, బడి బయట పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఎడ్యుకేషన్ అసిస్టెంట్, వలంటీర్లతో సర్వే చేయించాలని ఆదేశించారు. జిల్లాలోని 1,299 పాఠశాలకు ప్రభుత్వం కేటాయించిన రూ.9 కోట్ల నిధులను అత్యవసర పనులకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

బురదలో ఇరుక్కున్న ఆవు



ఆవును కాపాడే ప్రయత్నం చేస్తున్న రైతులు

మడకశిర రూరల్: మండలంలోని జమ్మానిపల్లి గ్రామంలో రైతు చిన్న రంగప్పకు చెందిన పాడి ఆవు మల్లమ్మ గుడి వద్ద బురదలో ఇరుక్కుపోయింది. గురువారం మధ్యాహ్నం మేత మేస్తూ వంక పక్కనే ఉన్న బురదలోకి ప్రవేశించడంతో నాలుగు కాళ్లూ మొత్తం దిగబడి పోయాయి. ఎంత సేపటికీ పాడి ఆవు కనిపించకపోవడంతో రైతు రంగప్ప అటుగా వెళ్లి చూడడంతో అసలు విషయం వెలుగు చూసింది. విషయాన్ని వెంటనే చుట్టుపక్కల గ్రామాల రైతులు తెలుసుకుని అక్కడకు చేరుకుని ఆవును వెలికి తీసేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఆగమేఘాలపై అక్కడకు చేరుకుని అతి కష్టంపై ఆవును సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.

మోగిన నగారా



పట్టభద్ర, ఉపాధ్యాయ ఓటర్లు ఇలా....		
జిల్లా	పట్టభద్ర ఓటర్లు	ఉపాధ్యాయ ఓటర్లు
కర్నూలు	61,684	5,364
నంద్యాల	54,803	4,402
అనంతపురం	67,665	5,461
శ్రీ సత్యసాయి	43,007	3,199
వైఎస్సార్	81,187	7,358
అన్నమయ్య	20,461	1,932
మొత్తం	3,28,807	27,716

ఫిబ్రవరి 16
ఎన్నికల నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ

ఫిబ్రవరి 23
నామినేషన్ల దాఖలుకు ఆఖరు

ఫిబ్రవరి 24
నామినేషన్ల పరిశీలన

ఫిబ్రవరి 27
నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ

మార్చి 13 పోలింగ్

మార్చి 16 ఓట్ల లెక్కింపు

మార్చి 21
ఎన్నికల ప్రక్రియ ముగింపు

- ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల
- గురువారమే అమల్లోకి ఎన్నికల కోడ్
- ఉపాధ్యాయ, పట్టభద్రుల, స్థానిక సంస్థల స్థానాలకు ఎన్నికలు

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ (అనంతపురం, వైఎస్సార్, కర్నూలు)నియోజకవర్గం పట్టభద్ర, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నగరా మోగింది. భారత ఎన్నికల సంఘం గురువారం ఎన్నికల నిర్వహణ షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది.

మార్చి 21 వరకూ 'కోడ్'
షెడ్యూల్ ప్రకారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఈనెల 16వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేస్తారు. అదే రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుంది. నామినేషన్ల దాఖలుకు ఈనెల 23వ తేదీ వరకూ అవకాశం ఉంటుంది. 24వ తేదీన నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ), 27వ తేదీ వరకూ నామినేషన్ల ఉపసంహణకు ఛాన్స్ ఉంటుంది. మార్చి 13న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. 16వ తేదీన ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ మార్చి 21వ తేదీన ముగిస్తుంది.

మార్చి 29వ తేదీతో ముగియనున్న పదవీకాలం..
ప్రస్తుతం పశ్చిమ రాయలసీమ పట్టభద్ర నియోజకవర్గం నుంచి వెన్నపూస గోపాల్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తుండగా, ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి కత్తి నరసింహారెడ్డి, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం నుంచి జి.దీపక్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరందరి పదవీ కాలం మార్చి 29వ తేదీ ముగియనుంది. ఈ నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. జిల్లాలో పట్టభద్ర నియోజకవర్గ ఓటర్లు 3,28,807 మంది, ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్లు 27,716 మంది ఉన్నారు. ఇక స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నగర పాలక సంస్థ కార్పొరేటర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీ సభ్యులు ఓటర్లుగా ఉండగా జిల్లాలో 1,286 ఓట్లు ఉన్నాయి.

అమలులోకి ఎన్నికల కోడ్..
భారత ఎన్నికల సంఘం ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ షెడ్యూల్‌ను విడుదల చేసిన వెంటనే జిల్లాలో కోడ్ (ప్రవర్తనా నియమావళి) అమలులోకి వచ్చింది. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు కోడ్ అమల్లో ఉంటుంది.

ఓటర్లు ఇలా...
పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గత ఏడాది డిసెంబర్ 30న ఓటర్ల తుది జాబితాను విడుదల చేశారు. పశ్చిమ రాయలసీమ (అనంతపురం, వైఎస్సార్, కర్నూలు ఉమ్మడి జిల్లాలు) పట్టభద్ర నియోజకవర్గంలో 3,28,807 మంది ఓటర్లు ఉండగా... ఇందులో పురుష ఓటర్లు 2,21,558 మంది, మహిళ ఓటర్లు 1,07,216 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 33 మంది ఉన్నారు. ఇక ఉపాధ్యాయ నియోజకవర్గంలో 27,716 మంది ఓటర్లు ఉండగా... ఇందులో పురుష ఓటర్లు 17,023 మంది, మహిళ ఓటర్లు 10,689 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు నలుగురు ఉన్నారు. ఎన్నికల నామినేషన్ ప్రారంభించే ముందు రోజు వరకు ఓటర్లగా నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. దీంతో ఈనెల 15వ తేదీ వరకు అందే దరఖాస్తులను పరిశీలించి అర్హులకు ఓటు హక్కు కల్పించి అనుబంధ జాబితాలో చేరుస్తారు.

డూప్లికేట్ ఓట్లు తొలగించండి
- జాయింట్ కలెక్టర్ చేతన్ ఆదేశం



మాట్లాడుతున్న జేసీ చేతన్

పుట్టపర్తి అర్బన్: ఓటరు జాబితాలోని డూప్లికేట్‌లను తొలగించాలని జాయింట్ కలెక్టర్ (జేసీ) చేతన్ ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదు, చిరునామా మార్పు తదితరాలకు సంబంధించి 44,331 దరఖాస్తులను పరిశీలించి 33,990 దరఖాస్తులను ఆమోదించినట్లు చెప్పారు. ఫాం-6 కి సంబంధించి 21,988 దరఖాస్తుల్లో 16,739ని ఆమోదించి తక్కిన వాటిని తిరస్కరించినట్లు చెప్పారు. ఎన్నికల జాబితాలో 149 ఫొటో సారూప్యతలు ఉన్నట్లు గుర్తించామని, వాటిని బీఎల్‌ఓల ద్వారా తనిఖీ చేయించనున్నట్లు చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే ప్రక్రియలో భాగంగా కళాశాలల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలను చేపట్టాలన్నారు. త్వరలో జరగనున్న టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లాలో 54 పోలింగ్ స్టేషన్లు, పట్టభద్రుల ఎన్నికల కోసం 32 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే, అన్ని డివిజన్ కేంద్రాల్లో ప్రత్యేక ఎన్నికల సెల్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో డీఆర్‌ఓ కొండయ్య, పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టిస్తాం
- డీపీఓ విజయకుమార్ రెడ్డి



మాట్లాడుతున్న డీపీఓ విజయ్‌కుమార్ రెడ్డి

తనకల్లు: గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్త నుంచి సంపదను సృష్టిస్తామని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) విజయకుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో ఎంపీడీఓలు, ఈఓ ఆర్డీలు, కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, అగ్రికల్చర్, అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్లకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తనకల్లు, గోరంట్ల, చిలమత్తూరు మండలాలను లోకల్ ట్రెనింగ్ సెంటర్లుగా ప్రభుత్వం ఎంపిక చేసినట్లు తెలిపారు. అక్కడి నుంచి చెత్త నుంచి సంపద కేంద్రాల్లో వర్మీ కంపోస్టును ఏ విధంగా తయారు చేస్తారో ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. తడి, పొడి చెత్తను ఏ విధంగా సేకరించాలి, తడి చెత్తను ఏ విధంగా వేసి కుళ్లేటట్లు చేయాలి, కుళ్లిన చెత్తలో వానపాములను ఎలా పెంచాలి తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. తయారైన వర్మీ కంపోస్టు నాణ్యతను బట్టి కిలో రూ. 10 నుంచి రూ. 15కు విక్రయించి పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చనున్నట్లు చెప్పారు. అనంతరం మూడు మండలాల సిబ్బందికి వర్మీ కంపోస్టు తయారీ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓలు బాలాజీ, శివకుమారి, అంజినప్ప, ఎంపీడీఓలు పూల నరసింహులు, రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు పెళ్లి కానుక
- కల్యాణమస్తు, షాదీ తోఫా ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయం
- కులాంతర వివాహానికి మరింత ఎక్కువ
- జిల్లాలో 282 మందికి రూ.2.23 కోట్ల లబ్ధి
- నేడు నగదు విడుదల చేయనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి



కదిరి/ప్రశాంతి నిలయం: నిరుపేద కుటుంబాల్లోని ఆడపిల్లల వివాహాల కోసం జగన్ సర్కారు తన వంతు సాయం చేసేందుకు సిద్ధమైంది. 'వైఎస్సార్ కళ్యాణ మస్తు', ముస్లిం మైనార్టీల కోసం 'వైఎస్సార్ షాదీ తోఫా' పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు చెందిన ఆడపిల్లల పెళ్లికి నగదు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. గత అక్టోబర్‌లో తీసుకొచ్చిన ఈ పథకాలకు ఇప్పటి వరకూ జిల్లాలో 353 మంది దరఖాస్తు చేసుకోగా.. 282 మందిని అర్హులుగా ఎంపిక చేశారు. వీరందరికీ శుక్రవారం సీఎం వైఎస్ జగన్ నగదు విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా రూ.2.23 కోట్ల మెగా చెక్కును కలెక్టరేట్‌లో కలెక్టర్ బసంత్‌కుమార్ లబ్ధిదారులకు అందజేస్తారు.

అబ్బాయికి 21.. అమ్మాయికి 18 ఏళ్లు..
వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా వర్తించేందుకు వివాహ వయసు వరుడికి 21, వధువుకు 18 ఏళ్లు నిండాల్సిందే. అమ్మాయిలు చదువుకోవాలనే ఉద్దేశంతో వరుడితోపాటు ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే వధువు కూడా విధిగా 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. గ్రామీణ ప్రాంతంలో నెలకు రూ.10 వేలు, పట్టణ ప్రాంతాల్లో నెలకు రూ.12 వేలకు మించి ఆదాయం ఉండకూడదు. కుటుంబంలో మొదటి ఆడబిడ్డ పెళ్లికి మాత్రమే నగదు ప్రోత్సాహం ఇస్తారు.

వీరికి వర్తించదు..
- 2022 అక్టోబర్ 1 తర్వాత వివాహం చేసుకున్న వారికి మాత్రమే పథకం వర్తిస్తుంది.
- 3 ఎకరాలకు మించి మాగాణి లేదా 10 ఎకరాలకు మించి మెట్ట ఉండరాదు. మాగాణి, మెట్ట కలిపి 10 ఎకరాల లోపు ఉండచ్చు. + వధువు బీసీ, ఎస్సీ, ఎస్టీ లేదా మైనార్టీ సామాజిక వర్గానికి చెందిన వారై ఉండాలి. లేదంటే భవన నిర్మాణ కార్మికుల కుటుంబంలో జన్మించి ఉండాలి.
- ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ కుటుంబీకులకు వర్తించదు. పారిశుధ్య కార్మిక కుటుంబాలకు మినహాయింపు.
- సొంత కారు ఉన్న వారికి పథకం వర్తించదు. ట్యాక్సీ, ఆటో, ట్రాక్టర్ ఉన్న వారికి మినహాయింపు.
- 300 యూనిట్లపైన విద్యుత్ వినియోగించే వారికి ఈ పథకం వర్తించదు. 12 నెలల బిల్లు ప్రామాణికంగా తీసుకుంటారు.
- కుటుంబంలో ఏ ఒక్కరూ ఆదాయపన్ను చెల్లించేవారై ఉండరాదు.
- పట్టణ ప్రాంతాల్లో 1,000 చదరపు అడుగులకు మించిన నిర్మాణ ఆస్తి కలిగి ఉండకూడదు.

కావాల్సిన పత్రాలు..
- వివాహ ధ్రువీకరణ పత్రం
- వధువు, వరుడి ఆధార్ కార్డులు
- 10వ తరగతి పాస్ సర్టిఫికెట్
- పెళ్లి ఫొటోలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు
- పెళ్లి పత్రిక, బ్యాంకు పాస్‌బుక్
- దివ్యాంగులైతే తగిన సర్టిఫికెట్

మూడు నెలలకోసారి ఎంపిక..
పేద కుటుంబాల్లోని ఆడబిడ్డల పెళ్లికి ఆర్థిక సాయం కోరుతూ ఆన్‌లైన్ ద్వారా వచ్చే దరఖాస్తులను మూడు నెలలకు ఒకసారి సంబంధిత అధికారులు పరిశీలించి అర్హులైన వారిని ఎంపిక చేస్తారు. ప్రభుత్వం నగదు ప్రోత్సాహకం నేరుగా ఖాతాల్లో జమ చేస్తుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పిల్లలు తమ జీవిత భాగస్వామిగా తమ కులానికి చెందిన వారినే ఎంచుకుంటే నిర్దేశిత మొత్తం, ఇతర కులాలకు చెందిన వారిని పెళ్లి చేసుకుంటే అంతకన్నా ఎక్కువ మొత్తం అందజేస్తారు. దివ్యాంగులకు సంబంధించి ఇద్దరికీ వైకల్యం ఉన్నా.. లేదంటే ఒక్కరికే వైకల్యం ఉన్న వారైనా ఆడపిల్లకు మాత్రమే ప్రోత్సాహకం అందిస్తారు.

గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు ప్రక్రియ..
వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కోసం సమీప వార్డు /గ్రామ సచివాలయాల్లో సంప్రదించాలి. తగిన పత్రాలు తీసుకెళితే డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ లేదా డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు అక్కడే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు సహకరిస్తారు. ఆన్‌లైన్ ద్వారా నేరుగా దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు వివాహమైన 60 రోజుల్లోపు నవశకం పోర్టల్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వర్గం	ఆర్థిక ప్రోత్సాహం
ఎస్సీ	రూ.లక్ష
ఎస్సీ కులాంతర వివాహం	రూ1.20 లక్షలు
ఎస్టీ	రూ.లక్ష
ఎస్టీల కులాంతర వివాహం	రూ1.20 లక్షలు
బీసీ	రూ.50 వేలు
బీసీల కులాంతర వివాహం	రూ.75 వేలు
మైనార్టీ	రూ.లక్ష
దివ్యాంగులు	రూ.1.50 లక్షలు
భవన నిర్మాణ కార్మికులు	రూ.40 వేలు

హామీలన్నీ నెరవేర్చినట్లే



వైఎస్సార్ కల్యాణమస్తు పథకం ద్వారా పేదల పెళ్లిళ్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.40 వేల నుంచి రూ.లక్ష వరకూ ఆర్థిక సాయం అందిస్తోంది. దీంతో సీఎం జగన్ ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన హామీలు దాదాపుగా నెరవేర్చినట్లే. ఈ పథకాన్ని ఆయా వర్గాలు సద్వినియోగం చేసుకుంటే మంచిది. భవన నిర్మాణ కార్మిక కుటుంబాలకూ ఈ పథకం వర్తింపజేసిన సీఎం జగన్‌కు కార్మికులంతా రుణపడి ఉంటారు.

– నాగరాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు, కదిరి

రెండు నెలల్లోపు దరఖాస్తు చేసుకోవాలి



వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా పథకాలను అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు సద్వినియోగం చేసుకోవాలి. కులాంతర వివాహం చేసుకునే వారికి మరింత ఆర్థిక సాయం అందుతుంది. పెళ్లి చేసుకున్న వారు ముందుగా సచివాలయంలో మ్యారేజ్ సర్టిఫికెట్ పొంది అక్కడే దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ప్రక్రియ వివాహం జరిగిన రెండు నెలల్లోపు జరగాలి.

– నరసయ్య, డీఆర్‌డీఏ పీడీ

సరిహద్దుల్లో నిఘా పటిష్టం చేయండి
- ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్



మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్

పుట్టపర్తి అర్బన్: అంతర్రాష్ట్ర, జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లో పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ పేర్కొన్నారు. గురువారం ఆయన పుట్టపర్తిలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సెబ్ అధికారులతో సమీక్షించారు. జిల్లా ప్రజలు నాటుసారా జోలికి వెళ్లకుండా చూడాలన్నారు. దుష్పరిణామాలపై అవగాహన పెంచాలన్నారు. సివిల్ పోలీసులతో సమన్వయం చేసుకొని మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలన్నారు. కోర్టులో నంబరింగ్ తీసుకొని యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే మద్యం, నాటుసారా, ఇసుక, గేమింగ్‌లపై నిఘా పెంచాలన్నారు. పాత నేరస్తులు నేరాలకు పాల్పడితే కేసులతో పాటు బైండోవర్లు చేయించాలన్నారు. సీజ్ చేసిన వాహనాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ప్రసాద్, సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీపై కేసు నమోదు
హిందూపురం: నకిలీ ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు.. శ్రీకంఠాపురంలో రెండు ప్లాట్లు తమ పేరిట రిజిస్టర్ చేసుకోవాలన్న ఆలోచనతో పూలకుంటలో నివాసమున్నట్లు రఘు, లేట్ రామలక్ష్మి, లేట్ జయన్న, ప్రేమలు ఫ్యామిలీగా సర్టిఫికెట్ తయారు చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వాస్తవంగా ఫ్యామిలీ సర్టిఫికెట్‌లో ఎఫ్‌ఎస్‌సీ అని ఉంటుంది. అయితే ఈ సర్టిఫికెట్‌లో ఆర్‌ఓఆర్ పట్టదారు పాసుబుక్‌కు సంబంధించిన నంబర్ కోడ్ నమోదు చేశారు. ఈ విషయాన్ని గుర్తించిన రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది రెవెన్యూ అధికారులకు సమాచారమివ్వగా, వారు పరిశీలించి సర్టిఫికెట్ నకిలీదిగా తేల్చారు. గత ఏడాది ఆగస్టు వరకూ హిందూపురం తహసీల్దార్‌గా పనిచేసిన శ్రీనివాసులు పేరిట 2023 ఫిబ్రవరిలో కొట్నూరు వద్ద ఉన్న తస్నీమ్ బాను ఈసేవా కేంద్రం నుంచి సర్టిఫికెట్ మంజూరైనట్లు గుర్తించారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేసి సూత్రధారులపై కేసు నమోదు చేయాలని వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో గురువారం తహసీల్దార్ ఫిర్యాదు చేశారు.

విద్యార్థులపై తేనెటీగల దాడి
రొద్దం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులపై తేనెటీగలు దాడి చేశాయి. గురువారం పాఠశాల ఆవరణలో చెట్టుపై ఉన్న పెద్ద తేనెటీగల తుట్టెపైకి ఓ విద్యార్థి రాయి విసరడంతో ఒక్కసారిగా ఈగలు దాడి చేశాయి. ఘటనలో ఆరుగురు విద్యార్థులు గాయపడ్డారు. వారిని పాఠశాల హెచ్‌ఎం పద్మజారెడ్డి, ఉపాధ్యాయులు వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. గుణశ్రీ, భవ్యశ్రీ, సుస్మిత, పవన్, రాజేష్‌తో పాటు తాడంగిపల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉండడంతో పావగడలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అనంతరం ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు పేర్కొన్నారు.

రాజీమార్గం ప్రాధాన్యత వివరించాలి
- టెలీకాన్ఫరెన్స్‌లో అనంతపురం రేంజ్ డీఐజీ రవిప్రకాష్



మాట్లాడుతున్న డీఐజీ రవిప్రకాష్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఈనెల 11వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్ కోసం అందరూ సమన్వయంతో పని చేయాలని అనంతపురం రేంజ్ డీఐజీ ఎం.రవిప్రకాష్ తెలిపారు. గురువారం ఆయన తన చాంబర్ నుంచి ఆయన ఉమ్మడి అనంతపురం జిల్లా పోలీసు అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాజీమార్గం ప్రాధాన్యతను ఇరు వర్గాలకు తెలియజేసి, ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. దర్యాప్తు అధికారులు యూఐ కేసుల తగ్గింపు కోసం సంబంధిత న్యాయమూర్తులను సంప్రదించి పెండింగ్ కేసులు తగ్గేలా కృషి చేయాలన్నారు. ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి ఘటనలకు తావివ్వకూడదన్నారు. రానున్న రోజుల్లో స్పెషల్ బ్రాంచి విభాగాలు మరింత చురుకుగా పని చేయాలన్నారు. ముందస్తు సమాచార సేకరణలో ముఖ్యపాత్ర పోషించాలని సూచించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఎస్పీలు డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి, రాహుల్ దేవ్ సింగ్, జిల్లా పోలీసు కార్యాలయాల నుంచి ఇరు జిల్లాల పోలీసు అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎన్‌సీడీ - సీడీ సర్వేలు వందశాతం పూర్తి చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి

అమరాపురం: సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల గుర్తింపునకు చేపట్టిన సర్వే ప్రక్రియ అమరాపురం మండలంలో వంద శాతం పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందిని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీని గురువారం ఆమె తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, ఇతర రికార్డులు పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవలు, మందుల కొరత తదితర అంశాలపై డాక్టర్ మనోహర్‌నాయక్‌ను ఆరా తీశారు. అనంతరం హేమావతి, అమరాపురం పీహెచ్‌సీ.పరిధిలోని ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతూ.. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల సర్వేను వందశాతం పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు అంబరీష్, భార్గవ్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేష్, సూపర్‌వైజర్లు కుతుబుద్దీన్, రేణుక, రుక్మిణి, రాజశేఖర్, పద్మావతి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మా.. నేనూ బడికి పోతా!

- విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడి మంచాన పడిన బాలుడు
- చదువుకోవాలన్న అభిలాషతో తల్లడిల్లుతున్న విద్యార్థి
- చికిత్స కోసం రూ.లక్షలు వెచ్చించిన నిరుపేద తల్లిదండ్రులు
- మెరుగైన శస్త్రచికిత్స చేయించలేక సతమతం
- ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు



మంచానికే పరిమితమైన బాలుడు హర్షాద్

హిందూపురం: 'అమ్మా... నేనూ బడికి పోతా నమ్మా.. నాన్నకు చెప్పు.. నన్ను బడికి పిలుచుకెళ్లమని' అంటూ ప్రాధేయపడుతున్న ఆ బాలుడి మాటలు విన్న కన్నతల్లికి కంట నీరు ఆగలేదు. అందరిలా తాను కూడా ఆడుకోవాలని, చదువుకోవాలనే అభిలాషను వ్యక్తం చేస్తున్న కుమారుడిని చూస్తూ నిరుపేద తల్లిదండ్రులు అసహాయ స్థితిలో మౌనంగా రోదిస్తున్నారు.

ఏం జరిగింది?..

హిందూపురంలోని మేళాపురం ప్రాంతానికి చెందిన షేక్ రఫీక్, నూర్జహాన్ దంపతుల ఏకైక కుమారుడు హర్షాద్ ఏడో తరగతి చదువుతున్నాడు. నెల రోజుల క్రితం ఇంటిపైన కోతులు చేరుకుని అపరిశుభ్రం చేస్తున్నాయంటూ వాటిని అదిలించేందుకు కర్ర తీసుకుని మిద్దెపైకి హర్షాద్ వెళ్లాడు. ఆ సమయంలో కోతులను అదలిస్తూ ఇంటి పైభాగంలో వెళుతున్న హైటెన్షన్ (33కేవీ) విద్యుత్ వైర్ల ప్రభావం కారణంగా షాక్‌కు గురయ్యాడు. దీంతో మెడ నుంచి కుడి వైపు శరీరం మొత్తం కాలిపోయింది.

ఉన్నదంతా అమ్మి..

లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న రఫీక్ పెద్ద ఆస్తి పరుడేమీ కాదు. వృత్తిలో భాగంగా వచ్చే అరకొర ఆదాయంతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. అడపాదడపా కొంత మొత్తం పొదుపు చేసుకున్నాడు. ఈ క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురైన కుమారుడి ప్రాణాలు దక్కించుకునేందుకు తల్లిదండ్రులు నానా ఇబ్బందులు పడ్డారు. బెంగళూరులోని కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. వైద్య చికిత్సకు పొదుపు చేసుకున్న డబ్బుతో పాటు ఉన్న కొద్దిపాటి బంగారు నగలూ కర్పూరంలా కరిగిపోయాయి. దాదాపు రూ. 5లక్షలకు పైగా ఖర్చు పెట్టి కుమారుడి ప్రాణాలు కాపాడుకోగలిగారు. అయితే మెడ నుంచి నడుము వరకూ కుడివైపు శరీరం పూర్తిగా కాలిపోయి ముడతలు పడింది. కుడి చేతిలోని నాలుగు వేళ్లు తొలగించారు. శరీరంలో నీటి శాతం తగ్గింది. గొంతు వద్ద నరాలు గట్టిపడ్డాయి. శరీరంలో రక్తప్రసరణతో పాటు నరాల వ్యవస్థ మెరుగు పడాలంటే శస్త్రచికిత్స ఒక్కటే మార్గమని వైద్యులు తెలిపారు. ఇందు కోసం రూ. 30 లక్షల వరకూ ఖర్చు వస్తుందని వైద్యులు తెలపడంతో తల్లిదండ్రులు ఒక్కసారిగా కుదేలయ్యారు. ఇప్పటికే వారానికి ఒకసారి బెంగళూరుకు చికిత్స కోసం వెళ్లి వచ్చేందుకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకూ ఖర్చు వస్తోంది. ఈ క్రమంలో శస్త్రచికిత్సకు పెద్ద మొత్తం సమకూర్చుకోవడం తమకు తలకు మించిన భారమవుతోందని, ఎవరైనా మానవతావాదులు స్పందించి తమ బిడ్డను మామూలు మనిషిని చేయాలని వేడుకుంటున్నారు.

దాతలు సాయం చేయదలిస్తే...
పేరు: షేక్ మహమ్మద్ రఫీక్
బ్యాంక్ పేరు: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఖాతా నంబర్ : 3878 101 6511
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ : SBIN 0004696
ఫోన్ పే నంబర్ : 76709 34214

అందరికీ అనుకూలంగా మార్కెట్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం: ప్రజలందరికీ అనుకూలంగా ఉండేలా కూరగాయల మార్కెట్‌ను నిర్మించి, అందుబాటులోకి తీసుకువచ్చామని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అన్నారు. నూతనంగా నిర్మించిన కేతిరెడ్డి సూర్యప్రతాప్‌రెడ్డి కాయగూరల మార్కెట్ భవన సముదాయం చరిత్రాత్మకమని పేర్కొన్నారు. రూ.8 కోట్లతో నూతనంగా నిర్మించిన కాయగూరల మార్కెట్‌ను అక్కడే ఏర్పాటు చేసిన మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహావిష్కరణతో గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం వాణిజ్య సముదాయాల్లోని ఒక్కో గదిని మున్సిపల్ పాలకవర్గ సభ్యుల చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధర్మవరం మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. నూతనంగా నిర్మించిన కాయగూరల మార్కెట్ వల్ల మున్సిపాలిటీకి రూ.8 కోట్ల ఆస్తి సమకూరిందన్నారు. అంతేకాక ప్రతి నెలా అద్దెల రూపంలో రూ.8లక్షల వరకూ ఆదాయం సమకూరుతుందన్నారు. గతంలో మార్కెట్‌లో అపరిశుభ్రత తాండవిస్తూ రైతులకు, క్రయవిక్రయదారులకు నిలువ నీడ లేకుండా ఉండేదని గుర్తు చేశారు. దీంతో నూతన మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుడితే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న దుర్బుద్ధితో టీడీపీ నాయకులు కోర్టుకెళ్లి అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు. అయితే ప్రజల ఆశీర్వాదంతో కుట్రలను జయించి 13 నెలల్లోపే మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు. వాణిజ్య సముదాయంలోని మొత్తం 102 గదులను గుడ్‌విల్ ఓపెన్ యాక్షన్ ద్వారా వ్యాపారులకు, మరో 51 షెడ్‌లను నామమాత్రపు అద్దెతో చిరు వ్యాపారులకు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లింగం నిర్మల, వైస్ చైర్మన్లు ఎర్రగుంట భాగ్యలక్ష్మి, పెణుజూరు నాగరాజు, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, 40వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

పుల్లంపల్లిలో ఘర్షణ

తాడిమర్రి: మండలంలోని పుల్లంపల్లి గ్రామంలో బుధవారం రాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. పుల్లంపల్లిలోని ఎస్సీ కాలనీకి చెందిన బీదాల నల్లప్ప బుధవారం రాత్రి 7 గంటలకు తోట వద్ద నుంచి ఇంటికి వెళుతుండగా.. దయ్యం కిష్టయ్య అనుచితంగా మాట్లాడి, దాడి చేశాడు. దీంతో నల్లప్ప ఇంటికెళ్లి భార్య నారాయణమ్మకు తెలపడంతో ఆమె కిష్టయ్యను అతని వద్దకెళ్లి నిలదీసింది. ఆ సమయంలో కిష్టయ్య, అతని సమీప బంధువు అనంతయ్య, కుమారులు నల్లప్ప అతని భార్య నారాయణమ్మ, వారి కుమారుడు ఆనంద్‌పై దాడి చేశారు. ఘటనపై పరస్పరం ఫిర్యాదు చేయడంతో ఇరు వర్గాలపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రాయలసీమ రైతుల గొంతు కోసింది చంద్రబాబే

- టీడీపీ హయాంలోనే కర్ణాటక అక్రమ ప్రాజెక్టులకు పునాది
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ధ్వజం
- అప్పర్ భద్ర ప్రాజెక్టును అడ్డుకుంటామని స్పష్టీకరణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: రాయలసీమ జిల్లాల్లోని రైతుల గొంతు కోసింది టీడీపీ అధినేత చంద్రబాబేనని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ధ్వజమెత్తారు. టీడీపీ హయాంలో చంద్రబాబు చేసిన అడ్డగోలు వ్యవహారాల వల్లనే అప్పర్ భద్ర ప్రాజెక్టుకు కర్ణాటక ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని విమర్శించారు. గురువారం స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలోనే కర్ణాటకలో అక్రమ ప్రాజెక్టులకు పునాదులు పడ్డాయన్నారు. అప్పట్లో ప్రాజెక్టుల ఎత్తు పెంచినా నోరు మెదపలేదన్నారు. రెండో విడత అప్పర్ భద్ర ప్రాజెక్టుకు అనుమతులు వచ్చినా అభ్యంతరం చెప్పలేదన్నారు. వైఎస్ రాజశేఖర రెడ్డి బతికున్నంత కాలం అప్పర్ భద్ర ప్రాజెక్టుకు ఎలాంటి కేటాయింపులు, అనుమతులు రాలేదని ఆయన గుర్తు చేశారు. 2010లో 9 టీఎంసీల కృష్ణా జలాలను కేటాయిస్తే 2011లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లి స్టే తెచ్చిందన్నారు. ఈరోజుకు కూడా అప్పర్‌భద్ర ప్రాజెక్టుకు కేటాయింపులు లేవన్నారు. పట్టిసీమ డైవర్షన్ ద్వారా గోదావరి నీటిని కృష్ణా బేసిన్‌కు మళ్లించారనే సాకుతో తమ రాష్ట్రానికి అదనంగా 25 టీఎంసీల నీటిని కేటాయించాలనే వాదనను తీసుకొచ్చిన కర్ణాటక రాష్ట్రం వీటిని కూడా అప్పర్‌భద్ర ప్రాజెక్టుకు వినియోగించుకోవడానికి డీపీఆర్ తయారుచేసిందన్నారు. 2017లో టీడీపీ హయాంలోనే ప్రాజెక్టు కోసం స్టేజ్-2 అనుమతులు వచ్చాయన్నారు. ఇంత జరిగినా చంద్రబాబు ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే తమ ప్రభుత్వం పలుమార్లు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ కేంద్రానికి లేఖలు పంపిందన్నారు. కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయంపై కచ్చితంగా న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. త్వరలో సుప్రీం కోర్టులో పిటీషన్ వేయనున్నట్లు వెల్లడించారు.

చంద్రబాబును జైలుకు పంపాలి..

జలవనరుల రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిన వ్యక్తి చంద్రబాబు అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి దుయ్యబట్టారు. 2004లో చంద్రబాబు దిగిపోయే నాటికి 2003-04లో రూ. 1,600 కోట్లు ఖర్చు చేస్తే, 2004-05లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రూ. 3,300 కోట్లు, ఆ తరువాతి సంవత్సరాల్లో రూ. 6 వేల కోట్లు, రూ. 9 వేల కోట్లు, రూ. 12 వేల కోట్లు, రూ. 16 వేల కోట్లను కేటాయించి సాగునీటి రంగాన్ని కొత్త పుంతలు తొక్కించారన్నారు. కోటి ఎకరాలకు సాగునీరు లక్ష్యంగా రూ. లక్ష కోట్లతో జలయజ్ఞం పథకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పట్టిసీమ ప్రాజెక్టు పేరుతో మాయ మాటలు చెప్పి కాలం వెళ్లబుచ్చారని విమర్శించారు. కర్ణాటకలో ఎన్నికలు సమీపిస్తుండడంతో బీజేపీ అక్కడ మళ్లీ అధికారం చేపట్టడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటోందని ఆరోపించారు. మన రాష్ట్రంలో ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించకుండా అన్యాయం చేస్తోందన్నారు. చంద్రబాబు అధికార యావకు నేడు రాయలసీమలో రైతులు నష్టపోవాల్సిన దుస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఆవేదన మిగిల్చిన చంద్రబాబును ఉరితీయడమో లేదా జైలుకో పంపాలన్నారు. టీడీపీ నేతల కపటనాటకాలను ప్రజలు గమనిస్తున్నారని, మళ్లీ వారే తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు.

యువకుడి హత్య కేసులో ఇద్దరి అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

హిందూపురం: చిలమత్తూరు మండలం సోమఘట్ట గ్రామానికి చెందిన నాగరాజు (33) హత్యకేసులో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను హిందూపురం రూరల్ సీఐ వేణుగోపాల్ గురువారం వెల్లడించారు. సోమఘట్టకు చెందిన నాగరాజు వ్యసనపరుడు. జులాయిగా తిరుగుతూ తన వ్యసనాలు తీర్చుకునేందుకు అవసరమైన డబ్బు కోసం తండ్రి శివప్పను వేధించేవాడు. ఈ క్రమంలోనే తరచూ తండ్రితో ఘర్షణ పడేవాడు. చెడు వ్యసనాలకు బానిసగా మారి, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ తనకు చెడ్డపేరు తెస్తున్నావని, వ్యసనాలు తీర్చుకునేందుకు 15 ఎకరాల పొలం అమ్ముకోవాల్సి వచ్చిందని తండ్రి మందలించాడు. దీంతో తండ్రిపై భౌతిక దాడి చేశాడు. ఈ క్రమంలోనే అదే గ్రామానికి చెందిన అంజనప్ప కుమార్తెపై కన్నేసిన నాగరాజు తరచూ ఆమె ఇంటి వద్దకెళ్లి వేధించేవాడు ఈ విషయం తెలుసుకున్న అంజనప్ప పలుమార్లు మందలించినా నాగరాజులో మార్పు రాలేదు. దీంతో విషయాన్ని నాగరాజు తండ్రి శివప్ప దృష్టికి తీసుకెళ్లాడు. అప్పటికే నాగరాజు వైఖరితో విసుగు చెందిన శివప్ప ఇక కుమారుడిలో మార్పు రాదని నిర్ధారించుకుని ఎలాగైనా జులాయిని హతమార్చి గ్రామంలోని మహిళలకు ఊరట కలిగించాలని అనుకున్నాడు. ఇదే విషయాన్ని అంజనప్పకు తెలిపి సాయం కోరాడు. అనంతరం పథకం ప్రకారం ఈ నెల 1న తన పొలంలో నీటి పైపునకు మరమ్మతు చేయాలంటూ నాగరాజును పిలుచుకుని అంజనప్ప వెళ్లాడు. పొలంలో గుంతలో దిగి పైపునకు మరమ్మతు చేస్తుండగా వేటకొడవలితో నరికి హతమార్చారు. అనంతరం శివప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే శివప్ప ప్రవర్తనపై అనుమానం కలగడంతో నిఘా ఉంచి పక్కా ఆధారాలతో గురువారం ఉదయం కొడికొండ చెక్‌పోస్టు వద్ద నిందితులను అరెస్ట్ చేశారు. వీరి నుంచి వేటకొడవలితో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

అగ్రి ల్యాబ్‌ను పరిశీలించిన డీడీ



కొత్తచెరువులో అగ్రిల్యాబ్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున

కొత్తచెరువు: డాక్టర్ వైఎస్సార్ అగ్రి ల్యాబ్‌లు రైతులకు ఎంతో ఉపయోగకరమని తిరుపతి రీజనల్ కోడింగ్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ భవనాన్ని గురువారం ఆయన పరిశీలించారు. త్వరలో ల్యాబ్‌ను ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తేనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట పెనుకొండ ఏడీఏ స్వయంప్రభ, ఏఓ నటరాజ్, అగ్రిల్యాబ్ సిబ్బంది ఉన్నారు.


పెనుకొండ: డాక్టర్ వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌ల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులను రైతులకు అందజేయవచ్చునని తిరుపతి రీజియనల్ కోడింగ్ సెంటర్ అగ్రికల్చర్ డీడీ మల్లికార్జున పేర్కొన్నారు. స్థానిక అగ్రి ల్యాబ్‌ను గురువారం ఆయన పరిశీలించి, మాట్లాడారు. నియోజకవర్గ స్థాయి అగ్రి ల్యాబ్‌ల ద్వారా రైతులకు చేకూరే ప్రయోజనాలను వివరించారు. అగ్రి ల్యాబ్ సేవలను సద్వినియోగం చేసుకునేలా రైతులను చైతన్య పరచాలని వ్యవసాయాధికారులకు సూచించారు. ఏడీ స్వయం ప్రభ, వ్యవసాయాధికారి సురేంద్రనాయక్, ల్యాబ్ సహాయకులు చక్రపాణిరెడ్డి, నరసింహమూర్తి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: స్థానిక మార్కెట్ యార్డులోని అగ్రి ల్యాబ్‌ను గురువారం తిరుపతి రీజనల్ కోడింగ్ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున పరిశీలించారు. ఈ సందర్భంగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యత నిర్ధారణ పరీక్షలకు సంబంధించిన పరికరాలను పరిశీలించారు. స్టాకు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. అలాగే గొట్లూరు గ్రామంలోని ఈ-పంట నమోదు చేసిన వేరుశనగ పంటను జిల్లా వ్యవసాయ అధికారి వైటీ సుబ్బారావు పరిశీలించారు. పంట నమోదు చేసుకున్న పొలాలను పరిశీలించి, రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం..

ప్రాణాలు కోల్పోయిన రైతు

- విద్యుదాఘాతంతో యువరైతు మృతి
- ఫ్యూజులు మార్చుకోమన్న విద్యుత్ శాఖ సిబ్బంది
- ట్రాన్స్‌ఫార్మర్‌లో హెడ్‌ఫ్యూజులు వేస్తుండగా ఘటన



భర్త మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య లీలావతి

కంబదూరు: 'అన్నా! పంటకు నీరు పెట్టుకోవాలి. కరెంటు లేదు. ట్రాన్స్‌ఫార్మర్‌లో హెడ్ ఫ్యూజులు పోయాయి. కాస్త వచ్చి ఫీజులు వేసివ్వండి' అంటూ విద్యుత్ శాఖ సిబ్బందిని ప్రాధేయపడిన యువరైతు.. కాసేపటికే విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. స్థానికులు, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... కంబదూరు మండలం డి.చెన్నేపల్లికి చెందిన బొమ్మయ్య (26), లీలావతి దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. లీలావతి ప్రస్తుతం మూడు నెలల బాలింత.

చేసుకోపో ఏమీ కాదులే..

వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని బొమ్మయ్య పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం తన వ్యవసాయ బోరు బావికి అనుసంధానం చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో హెడ్ ఫ్యూజు పోయింది. ఇదే విషయాన్ని నూతిమడుగు ఫీడర్ సబ్‌స్టేషన్ లైన్‌మెన్‌కు బొమ్మయ్య తెలిపాడు. ప్రస్తుతం పవర్ కట్ అయిందని, కాబట్టి నీవే పోల్ ఎక్కి హెడ్‌ఫ్యూజులు వేసుకోవాలంటూ లైన్‌మెన్ సూచించాడు. అయితే కరెంట్ వస్తే ఎలా? అంటూ బొమ్మయ్య ప్రశ్నించడంతో ఇప్పట్లో కరెంట్ రాదు కాబట్టి ఏమీ కాదులే ధైర్యంగా పని పూర్తి చేసుకో అంటూ లైన్‌మెన్ తెలపడంతో బొమ్మయ్య స్తంభం ఎక్కి హెడ్ ఫ్యూజులు వేస్తుండగా ఒక్కసారిగా కరెంటు సరఫరా అయింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురై స్తంభం నుంచి కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై సంబంధిత ఏఈని వివరణ కోరేందుకు ప్రయత్నించగా.... ఆయన అందుబాటులో రాలేదు. కంబదూరు ఎస్‌ఐ రాజేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువకుడి అనుమానాస్పద మృతి



మృతుడు గణేష్

చిలమత్తూరు: మండలంలోని శెట్టిపల్లికి చెందిన గణేష్(25) గ్రామ సమీపంలోని పొలాల్లో అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. వివరాలు... పెనుకొండలో ఇంటర్ చదువుతున్న ఓ యువతిని గణేష్ ప్రేమించాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబపెద్దలు కొన్ని రోజులుగా గొడవ పడుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం గ్రామ శివారులోని పొలంలో గణేష్ విగతజీవిగా కనిపించడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. క్రిమి సంహార మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లుగా తొలుత పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించినా... తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ వీఆర్‌ఏ మృతి

బత్తలపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడి బెంగళూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీఆర్‌ఏ గంగప్ప అలియాస్ గంగాధర్ (33) గురువారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బుధవారం సాయంత్రం బత్తలపల్లి మండలం నల్లబోయినపల్లి గ్రామానికి చెందిన అభిరామిరెడ్డి ద్విచక్రవాహనంలో తన స్వగ్రామం నుంచి బత్తలపల్లికి వస్తుండగా మార్గ మధ్యంలో డి.చెర్లోపల్లికి చెందిన వీఆర్‌ఏ గంగప్ప బత్తలపల్లికి వచ్చేందుకు ఎక్కాడు. తంబాపురం క్రాస్ వద్దకు చేరుకోగానే ట్రాక్టర్ ఢీకొంది. ఘటనలో గాయపడిన ఇరువురినీ బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉన్న గంగప్పను కుటుంబసభ్యులు బెంగళూరుకు తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక గురువారం ఉదయం మృతి చెందాడు. మృతునికి భార్యతోపాటు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కాగా, వీఆర్‌ఏ మృతిపై తహసీల్దార్ యుగేశ్వరిదేవి, డిప్యూటీ తహసీల్దార్ హరిప్రసాద్, కార్యాలయ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.